

చీనీ టన్ను రూ.34,250

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34,250, కనిష్టంగా రూ.23 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.21 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.8°/ 18.1°

జిల్లాలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తగ్గిన ఎండు మిర్చి ధర



మార్కెట్‌కు వచ్చిన ఎండుమిర్చి

హిందూపురం అర్బన్‌: ఎండుమిర్చి ధర తగ్గింది. రెండు వారాల క్రితం క్వింటా రూ.19 వేలకు పైగా పలికిన ఎండుమిర్చి 15 రోజుల్లో ఏకంగా రూ.4 వేల నుంచి రూ.5 వేల దాకా పడిపోయింది. మంగళవారం హిందూపురం మార్కెట్‌కు 550 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, మొదటి రకం క్వింటా రూ.14 వేలు, రెండో రకం రూ.10 వేలు, మూడో రకం రూ.7 వేల చొప్పున ధర పలికినట్లు మార్కెట్‌ కార్యదర్శి చంద్రమోహన్‌ తెలిపారు. ఎండుమిర్చిలో తేమశాతం ఎక్కువగా ఉండటం, ప్రధాన నగరాల నుంచి డిమాండ్‌ తక్కువగా ఉండటంతో ధర తగ్గినట్లు వ్యాపారులు, అధికారులు చెబుతున్నారు.

టమాటకు ఇన్సూరెన్స్‌

- ఎకరాకు రూ.1,600 ప్రీమియం



పుట్టపర్తి అర్బన్‌: టమాట పంటకు ప్రభుత్వం ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించిందని ఉద్యానశాఖ అధికారి నవీన్‌కుమార్‌ తెలిపారు. 'ఇఫ్‌కో–టోకియో' కంపెనీ ఇన్సూరెన్స్‌ చేస్తోందని, ఒక ఎకరాకు రూ.3,200 ప్రీమియంగా నిర్ణయించిందన్నారు. ఇందులో సగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని, మిగతా రూ.1,600 రైతులు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు డిసెంబర్‌ 15వ తేదీలోపు సీఎస్‌సీ కేంద్రాలు, సచివాలయాల్లో ప్రీమియం చెల్లించి రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి సూచించారు. పూర్తి వివరాలకు 7989690495 నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఒకవేళ ప్రీమియం చెల్లించిన రైతులు తమకు బీమా వద్దనుకుంటే ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారన్నారు. ఈ పథకం ద్వారా అత్యధికంగా ఎకరాకు రూ.32 వేల వరకూ బీమా సదుపాయం ఉంటుందన్నారు.

23న సాగునీటి సంఘాల ఎన్నికలు

ప్రశాంతి నిలయం: జిల్లాలోని 230 సాగునీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల స్థానాలకు ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ తెలిపారు. ఇందుకు రెవెన్యూ, మైనర్‌ ఇరిగేషన్‌ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నిర్వహణలో జలవనరుల శాఖ అధికారులు కూడా నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌ సమావేశ మందిరంలో తొలి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గొడవలు తలెత్తకుండా మైనర్‌ ఇరిగేషన్‌ అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. కాడా కమిషన్‌ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు లిస్ట్‌ తప్పుల్లేకుండా తయారు చేయాలని, నోడల్‌ ఆఫీసర్లు జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయసారథి, జలవనరుల శాఖ ఈఈ రాధాకృష్ణ, డీఈ గంగాధర్‌, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌ కుమార్‌, మహేష్‌, శర్మ, ఇరిగేషన్‌ అధికారులు పాల్గొన్నారు.

నాలుగో సింహం విలవిల

- లాటరీలో మద్యంషాపు దక్కించుకున్న ఓ వ్యక్తి అనంతపురం హౌసింగ్‌బోర్డులో ఇటీవల దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు సన్నద్ధమయ్యాడు. అయితే, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వన్‌టౌన్‌ సీఐ రాజేంద్ర యాదవ్‌ సదరు వ్యక్తికి ఫోన్‌ చేసి బెదిరింపులకు దిగారు. అక్కడ ఎలా షాప్‌ పెడతావంటూ హెచ్చరించారు. దీంతో సదరు షాపు నిర్వాహకుడు హిందూపురం ఎంపీ పార్థసారథిని కలిసి సీఐకి వార్నింగ్‌ ఇప్పించాక మార్గం సుగమమైంది.
- కొన్ని రోజుల క్రితం తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌ రెడ్డి సీఐ లక్ష్మీకాంత రెడ్డిపై చిందులు తొక్కారు. తాను చెప్పినట్టు వినలేదంటూ రెచ్చిపోయారు. జనం ముందే సీఐతో క్షమాపణలు చెప్పించుకున్నారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు నివ్వెరపోయారు. అయితే, ఆ తర్వాత నోరు విప్పిన బాధిత సీఐ.. తాను తప్పు చేయకపోయినా, కొన్ని పరిస్థితుల కారణంగా సారీ చెప్పాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.
- కొద్ది రోజుల క్రితం మడకశిర నియోజకవర్గంలో నేరాల నియంత్రణపై పోలీసులు సమీక్ష సమావేశం నిర్వహించగా.. ఎమ్మెల్యే అక్కడికి వచ్చారు. పోలీసులు తమ విధుల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలోనూ ప్రజాప్రతినిధి తలదూర్చడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అధికారం అడ్డం పెట్టుకుని ఇలా ప్రవర్తించడం సరికాదని నియోజకవర్గ పోలీసులు వాపోయారు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని హనకనహాల్‌లో ఇటీవల దుండగులు రాములవారి రథాన్ని దహనం చేశారు. ఈ క్రమంలో రఘునాథరెడ్డి అనే ఓ కానిస్టేబుల్‌ను అనవసరంగా టార్గెట్‌ చేస్తూ ప్రజాప్రతినిధులు మాట్లాడారు. దీనిపై ఎస్పీ గానీ, డీఎస్పీ గానీ, పల్లెత్తు మాట మాట్లాడలేదు. బాధిత కానిస్టేబుల్‌కు కనీస భరోసా ఇచ్చిన పాపాన పోలేదు.

- బాస్‌ ఎవరో తేల్చుకోలేక సతమతం
- ఎమ్మెల్యేల మితిమీరిన పెత్తనం
- గతంలో ఎన్నడూ లేని విధంగా నేతల జులుం
- చెప్పినట్టు చెయ్యకపోతే నేరుగా ఫోన్లు చేసి బెదిరింపులు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో శాంతి భద్రతలపై తీవ్ర ప్రభావం
- కానిస్టేబుల్‌ నుంచి సీఐల వరకు ఎస్పీ మాట వినడం లేదని విమర్శలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రజాప్రతినిధులు చట్టాలు చేస్తారు.. ఆ చట్టాలను అధికారులు అమలు చేస్తారు. కానీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇందుకు భిన్నంగా కథ సాగుతోంది. 'చట్టాలు మేమేం చేస్తాం, వాటిని అమలు కూడా మేమే చేస్తాం' అన్నట్లుగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచి ఈ వింత పోకడ సాగుతోంది.

ఖాకీల ఉక్కిరిబిక్కిరి..

శాంతిభద్రతల పర్యవేక్షణలో కీలకంగా ఉండే ఖాకీలపై ఇటీవల ఎమ్మెల్యేల ఒత్తిళ్లు ఎక్కువైపోయాయి. దీంతో ఎటూ పాలుపోక పోలీసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇసుకాసురుల నుంచి మద్యం మాఫియా వరకూ ఎవరిపై చర్యలు తీసుకోవాలన్నా ఎమ్మెల్యేల అనుమతి ఉంటేనే పోలీసులు ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. సాధారణంగా ఎక్కడైనా నేరాలు జరుగుతుంటే ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం ముందుకు వెళుతుంది. కానీ ఉమ్మడి జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనైనా సరే ఎమ్మెల్యే చెబితేనే చర్యలు ప్రారంభిస్తున్నారు. అనంతపురం వన్‌టౌన్‌ స్టేషన్‌ పరిధిలో మట్కా, బెట్టింగ్‌ విచ్చలవిడిగా జరుగుతున్నా సీఐ కనీసం చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో పాటు స్టేషన్‌ పరిధిలో రేషన్‌ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అదుపుతప్పిన శాంతిభద్రతలు..

'కనిపించే మూడు సింహాలు కాదు కనిపించని నాలుగో సింహమేరా పోలీస్‌' అన్న డైలాగులు ఉమ్మడి జిల్లా పోలీసులకు ఏ మాత్రమూ సరిపోవడం లేదు. ఏళ్ల నుంచి వివిధ హోదాల్లో పనిచేసిన పోలీసులు సైతం ఎమ్మెల్యేల బెదిరింపులతో వణికిపోతున్నారు. తమ బాస్‌ ఎస్పీనా, ఎమ్మెల్యేనా అన్నది తేల్చుకోలేని అత్యంత దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్పీకి ముందు సమాచారం ఇస్తే ఎమ్మెల్యే నుంచి ఎలాంటి ముప్పు వస్తుందో, అలాగని ఎమ్మెల్యేల మాటలు విని ముందుకెళ్లాక మీడియాలో వార్తలు వస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారో అన్న భయంతో కిందిస్థాయి పోలీసులు నలిగిపోతున్నారు. ఇదే క్రమంలో పోలీసులెవరూ ఎస్పీని లెక్కచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. గంజాయి, మట్కా, బెట్టింగ్‌, ఇసుక మాఫియా, గ్రావెల్‌ మాఫియా, జూదం...అన్నిటికీ మించి బెల్టుషాపుల ఏర్పాటు వంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ



అనంతపురం అగ్రికల్చర్‌: రబీలో నీటి వసతి కింద వేరుశనగ సాగు చేసే రైతులకు ఈ నెల 15 తర్వాత 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ పంపిణీకి వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్‌ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు మంగళవారం కమిషనరేట్‌ నుంచి పూర్తి ధర, రాయితీ వివరాలు ప్రకటించారు. ఈ ఏడాది అనంతపురం జిల్లాలో 6,770, శ్రీ సత్యసాయి జిల్లాలో 7,660 క్వింటాళ్ల కే–6, టీసీజీఎస్‌–1694, కదిరి లేపాక్షి–1812 రకం విత్తన వేరుశనగ పంపిణీ చేసే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. కే–6, టీసీజీఎస్‌–1694 రకం పూర్తి ధర క్వింటా రూ.9,600 కాగా అందులో 40 శాతం రూ. 3,840 రాయితీ పోనూ రైతులు రూ.5,760 చెల్లించాల్సి ఉంటుంది. కదిరి లేపాక్షి– 1812 రకం ధర రూ.8,500 కాగా 40 శాతం రాయితీ రూ.3,400 పోనూ రైతులు రూ.5,100 చెల్లించాలి. 30 కిలోల బ్యాగు రూపంలో పంపిణీ చేస్తారు. భూ విస్తీర్ణం బట్టి ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు (90 కిలోలు) పంపిణీ చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఈనెల 10 తర్వాత ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాలో 20 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగులోకి రావచ్చని అంచనా వేశారు. ఈనెల 15 నుంచి డిసెంబర్‌ 15వ తేదీ వరకు వేరుశనగ విత్తుకునేందుకు అనుకూలమని శాస్త్రవేత్తలు తెలిపారు.

అట్రాసిటీ చట్టం పక్కాగా అమలు





మాట్లాడుతున్న కలెక్టర్‌ చేతన్‌, చిత్రంలో జేసీ అభిషేక్‌, సమావేశంలో పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు

- చట్టంపై అవగాహన కల్పించాలి
- సచివాలయాల్లో 14566 నంబర్‌ ప్రదర్శించాలి
- కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి విజిలెన్స్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కలెక్టర్‌ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని, ఇందుకోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పెండింగ్‌ కేసులతో పాటు వివాదాలు, భూ కబ్జాలపై వచ్చిన ఫిర్యాదులను రెవెన్యూ, పోలీస్‌ అధికారులు పరిశీలించి బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలన్నారు. అట్రాసిటీ చట్టంపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మహిళలకు భద్రత కల్పించేందుకు పీఓఏ చట్టం అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఇప్పటి వరకు నమోదైన కేసును, అధికారులు తీసుకున్న చర్యలు, బాధితులకు అందిన పరిహారంపై కలెక్టర్‌ చర్చించారు. ముఖ్యంగా పౌర హక్కుల అమలు తీరును క్షేత్రస్థాయిలో గమనించడానికి ప్రతి నెలా చివరి రోజున గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ఎఫ్‌ఐఆర్‌ నమోదు, పరిహారం అందించే అంశంలో అలసత్వం వహించకూడదని కలెక్టర్‌ సూచించారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసులను సమన్వయ సహకారంతో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా యంత్రాంగం కూడా త్వరలోనే గ్రామ సభలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికల కోసం స్థలం గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను కలెక్టర్‌ ఆదేశించారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ హెల్ప్‌లైన్‌ నంబర్‌ 14566 ను పట్టికల నోటీసులో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌, అడిషనల్‌ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్‌, పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌ కుమార్‌, మహేష్‌, శర్మ, పెనుకొండ, కదిరి, హిందూపురం డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శివనారాయణ స్వామి, కేవీ మహేష్‌, ధర్మవరం రూరల్‌ సీఐ నాగేంద్ర ప్రసాద్‌, కమిటీ సభ్యులు వీరనారాయణ, శ్రీనివాస నాయక్‌, శ్రీనివాసులు, గంగులయ్య, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో కుటిల రాజకీయం

క్యాంపు రాజకీయాలతో ఎన్టీఆర్‌ నుంచి టీడీపీని చంద్రబాబు లాక్కోగా... ఆయన బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా బావ బాటలోనే నడుస్తున్నారు. 38 కౌన్సిల్‌ స్థానాలున్న హిందూపురం మున్సిపల్‌ చైర్మన్‌ పీఠం కోసం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్లను తమవైపునకు తిప్పుకుని రిసార్ట్‌ రాజకీయం చేస్తున్నారు.

- బలం లేకున్నా మున్సిపల్‌ పీఠంపై టీడీపీ కన్ను
- ఆరుగురు కౌన్సిలర్లతో అధికారం కోసం తహతహ
- వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునేందుకు కుయుక్తులు
- ప్రలోభాలు, బెదిరింపులతో టీడీపీలో చేర్చుకుంటున్న వైనం
- తాజాగా తమ వర్గాన్ని హైదరాబాద్‌లోని రిసార్ట్‌కు తరలింపు
- నేరుగా మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నిక రోజు తీసుకొచ్చేలా ప్రణాళిక



హైదరాబాద్‌లోని ఓ రిసార్టులో తమవైపు లాక్కున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు

హిందూపురం: నోరు తెరిస్తే బ్లడ్డు...బ్రీడు అంటూ తన గురించి తాను గొప్పగా చెప్పుకునే ఎమ్మెల్యే బాలకృష్ణ నీచ రాజకీయానికి తెరతీశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే హిందూపురం మున్సిపల్‌ పీఠంపై ఆయన కన్నేశారు. తనకు అనుకూలమైన వారిని చైర్మన్‌ పీఠంపై కూర్చోబెట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు.

ప్రలోభాలు.. బెదిరింపులు

హిందూపురం మున్సిపాల్టీలో 38 వార్డులున్నాయి. గత మున్సిపల్‌ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ 30 స్థానాల్లో విజయదుందుభి మోగించింది. బీజేపీ ఒకటి, ఎంఐఎం మరో స్థానం దక్కించుకోగా...టీడీపీ అష్టకష్టాలు పడి ఆరింటితో సరిపెట్టుకుంది. పురంలో వైఎస్సార్‌ సీపీ అఖండ విజయం సాధించాక ఆ పార్టీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నారు. చైర్మన్‌ స్థానం కోసం ఎంతోమంది పోటీపడగా..మహిళకు పెద్దపీట వేశారు. అందులోనూ బీసీలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని భావించి తొలిసారి కౌన్సిలర్‌గా గెలిచిన బోయ ఇంద్రజకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. బీసీ సంక్షేమంపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. అయితే ఎమ్మెల్యే బాలకృష్ణ గిమ్మిక్కు రాజకీయాలు చేశారు. ప్రలోభాలకు గురిచేసి ఇంద్రజను టీడీపీ వైపునకు తిప్పారు. ఈ నేపథ్యంలోనే ఆమె తన అరోగ్య పరిస్థితి బాగోలేదన్న సాకుతో చైర్‌పర్సన్‌ స్థానానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి చైర్మన్‌ పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో బాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు దిగజారి ప్రవర్తించారు. వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రలోభాలకు తెరతీశారు. అందుకు లొంగని వారిని భయపెట్టారు. అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. ప్రస్తుతం హిందూపురం మున్సిపల్‌ కౌన్సిల్‌లో టీడీపీకి ఆరుగురు కౌన్సిలర్లు ఉండగా, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లను కలుపుకున్నారు. దీంతో టీడీపీ బలం 8కి చేరింది. దీంతో చైర్‌పర్సన్‌ ఇంద్రజతో పాటు మరికొంత మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమవైపు లాక్కున్నారు.

రిసార్ట్‌ రాజకీయం..

టీడీపీ, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లతో పాటు వైఎస్సార్‌ సీపీ నుంచి ఫిరాయించిన కౌన్సిలర్లు, వారి కుటుంబీకులను ఎమ్మెల్యే బాలకృష్ణ హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌కు తరలించారు. రెండురోజుల్లో చైర్మన్‌ ఎన్నిక కోసం నోటిఫికేషన్‌ విడుదల చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నోటిఫికేషన్‌ రాగానే కౌన్సిలర్లను నేరుగా కౌన్సిల్‌ సమావేశానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మూడునెలలుగా కౌన్సిల్‌ సమావేశాలు జరగకుండా అడ్డుకున్నారు. ప్రజల సమస్యలు గాలికి వదిలేసి చైర్మన్‌ పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న టీడీపీ నీచ రాజకీయాన్ని జనం ఛీదరించుకుంటున్నారు.



హోంమంత్రి అనిత నుంచి లాఠీ అందుకుంటున్న ప్రదీప్తి, చిత్రంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు

ప్రొబేషనరీ డీఎస్పీల వివరాలు..				
పేరు	జిల్లా	విద్యార్హత	వయస్సు	గతంలో ఉద్యోగం
టి.భవాని	వైఎస్సార్‌	బీటెక్‌	30	డిప్యూటీ తహసీల్దార్‌
కెల్ల ఉదయపావని	విజయనగరం	బీటెక్‌	26	------
వి. సదాసాయి అభిషేక్‌	తూర్పుగోదావరి	బీటెక్‌	32	ఇంటెలిజెన్స్‌ బ్యూరో ఏసీఐఓ–2
మోకన వెంకట కృష్ణ చైతన్య	కాకినాడ	బీడీఎస్‌	29	----------------
బొంత పావని	గుంటూరు	ఎంటెక్‌	30	-----------
కదలి జయకృష్ణ	తూర్పుగోదావరి	బీటెక్‌	31	సీఆర్‌పీఎఫ్‌ అసిస్టెంట్‌ కమాండర్‌
పాలగిరి ఆష్రఫ్‌ ఆలీ	వైఎస్సార్‌	బీటెక్‌	32	అసిస్టెంట్‌ మేనేజర్‌, ఐడీబీఐ బ్యాంకు
వెన్నా రాజసింహా రెడ్డి	పల్నాడు	బీటెక్‌	28	----
అంకిరెడ్డి పల్లి శివ ప్రియ	వైఎస్సార్‌	బీటెక్‌	29	సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌, హైదరాబాద్‌
కదలూరు మానస	హైదరాబాద్‌	బీడీఎస్‌	29	డెంటల్‌ ఆఫీసర్‌, ఈసీహెచ్‌ఎస్‌, సికింద్రాబాద్‌
పి. ప్రదీప్తి	శ్రీకాకుళం	బీటెక్‌	33	ఎక్సైజ్‌ ఎస్‌ఐ
సి. జీవన	అల్లూరి సీతారామరాజు	బీఎస్సీ	23	-----



పరేడ్‌ నిర్వహిస్తున్న ప్రొబేషనరీ డీఎస్పీలు



జీవనను ముద్దాడుతున్న తల్లి



తన మాతృమూర్తితో ఆర్‌. అభిషేక్‌ ఆనందం



బంధువులతో సెల్ఫీ దిగుతున్న దృశ్యం

కల సాకారమైన వేళ..

- అట్టహాసంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌
- 12 మంది డీఎస్పీలలో ఏడుగురు మహిళలే

అనంతపురం: ఉన్నతస్థాయికి చేరుకోవాలనే ఆకాంక్ష నెరవేరిన రోజు. లక్ష్యం సాకారమైన వేళ. తల్లిదండ్రులు, స్నేహితుల సమక్షంలో పరేడ్‌ నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్న సందర్భం జీవితంలో మరచిపోలేని ఘట్టం. ఈ మరుపురాని సన్నివేశాన్ని జీవితంలో పదిలపరచుకున్న వేళలో అందరూ తన్మయత్వం చెందారు. ఆనందభాష్పాల నడుమ కేరింతలు కొట్టారు. ఉన్నత స్థాయికి చేరిన బిడ్డలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయిన ఆనంద క్షణాలను పదిలపరుచుకున్నారు. ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ సందర్భంగా మంగళవారం అనంతపురం పోలీస్‌ శిక్షణ కళాశాలలో సందడి నెలకొంది. ముఖ్య అతిథిగా ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, విశిష్ట అతిథిగా డీజీపీ సీహెచ్‌ ద్వారకా తిరుమలరావు హాజరయ్యారు. ఏడాది పాటు శిక్షణ పూర్తి చేసుకుని, సమాజ సేవ చేయడానికి వెళ్తున్న డీఎస్పీలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తం 12 మంది డీఎస్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో ఏడుగురు మహిళలు, 5 మంది పురుషులు ఉండడం గమనార్హం. కేవలం 22 ఏళ్ల వయస్సులోనే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చిట్టపులి జీవన డీఎస్పీగా పోస్టింగ్‌ దక్కించుకున్నారు.



డీఎస్పీల పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ తిలకిస్తున్న జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

9 మంది ఇంజినీర్లే..

శిక్షణ పూర్తి చేసుకున్న 12 మందిలో 9 మంది ఇంజినీరింగ్‌ పూర్తి చేసుకున్నవారు కావడం విశేషం. ఇద్దరు బీడీఎస్‌, ఒకరు బీఎస్సీ చదివారు. ఒకప్పుడు ఆర్ట్స్‌ గ్రూపు చదివిన వారు మాత్రమే గ్రూప్‌–1, గ్రూప్‌–2 పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారు. తాజాగా సివిల్‌ సర్వీసెస్‌ నుండి గ్రూప్‌–2 వరకు ఇంజినీరింగ్‌ విద్యార్థులే సత్తా చాటుతుండడం గమనార్హం.

రాజ్యాంగానికి లోబడే విధులు

చట్టాన్ని గౌరవిస్తూ, రాజ్యాంగానికి లోబడే పోలీసులు విధులు నిర్వర్తిస్తారని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, తాము రాజ్యాంగానికి, చట్టానికి, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామన్నారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణే తమ విధానమన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో తాము పనిచేయబోమన్నారు.

క్లుప్తంగా

గంబూషియా చేపల విడుదల



వైద్య సిబ్బందికి గంబూషియా చేపలను అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: వ్యాధి కారకాలైన దోమలు, క్రిమి కీటకాలు వృద్ధి చెందకుండా మురుగు నీటి గుంతల్లో గంబూషియా చేపలను వదులుతున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గంబూషియా చేపలను ఆమె అందజేశారు. పుట్టపర్తి సమీపంలోని పలు మురుగు గుంతల్లో వాటిని వదిలిన అనంతరం జిల్లా మలేరియా అధికారి ఓబులుతో కలసి డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. కీటక జనిత వ్యాధులు, వీధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే నిర్వహించి ఆశా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోత్స్న, మునిచంద్రిక, సీహెచ్‌ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మీనాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ రమణయ్య, వెంకటేష్, గోపీనాయక్, జావీద్, యాదిల్ బాషా తదితరులు ఉన్నారు.

బంగారు నగల చోరీపై కేసు నమోదు

రొళ్ల: మండలంలోని కొత్తపాళ్యం తండా సమీపంలో 544ఈ జాతీయ రహదారి పక్కన నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప ఇంట్లో గత నెల 31న బంగారు నగల చోరీ జరిగిన విషయం తెలిసిందే. చోరీ ఘటనకు వారం రోజుల ముందు తిమ్మప్ప భార్య ఈరమ్మ బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ నెల 2న సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె బీరువా తాళం తీసిన దృశ్యాన్ని గమనించి భర్త తిమ్మప్పకు తెలిపింది. నాలుగు తులాల బంగారు గొలుసు, రెండు జతల కమ్మలతో పాటు ఒక జత యాంగీన్స్ మొత్తం 6.5 తులాల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్టోబర్ 31న ఇంటి వరండాలో నిద్రించిన సన్నిహితుడి ద్విచక్ర వాహనాల తాళాలు కూడా ఇంటి లోపల పడి ఉండడంతో సదరు వ్యక్తిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై కేసు నమోదు

కళ్యాణదుర్గం రూరల్: ఆన్‌లైన్ గేమింగ్‌లో మిత్రుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని దాడికి పాల్పడిన ఓ స్నేహితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... మండలంలోని పాలవాయి గ్రామానికి చెందిన రామాంజనేయులు, వన్నూరుస్వామి, హేమంత్ స్నేహితులు. వీరు ముగ్గురూ సోమవారం రాత్రి ఆన్‌లైన్‌లో గేమ్ ఆడుతూ ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో వన్నూరుస్వామి, హేమంత్‌పై రామాంజనేయులు దాడి చేసి పారిపోయాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వన్నూరుస్వామి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితుడు వన్నూరు స్వామి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ వంశీకృష్ణ మంగళవారం తెలిపారు.

దక్కుతున్న ఉపాధి ఫలాలు

- పెరుగుతున్న భూగర్భ జలాలు
- ఉద్యాన పంటలకు మహర్దశ



మడకశిరలోని చింత వనంలో చేరిన వర్షపు నీరు



కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి చెక్‌డ్యాంలో నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన ఉపాధి పనుల ఫలితాలు ఇప్పుడిప్పుడే జిల్లా వాసులకు దక్కుతున్నాయి. ఏటా వేసవిలో ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనులను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించడమే కాక.. చేసిన పనులకు వెంటనే కూలిని కూలీల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తూ వచ్చారు. దీంతో అప్పట్లో ఉపాధి పనుల్లో పాలు పంచుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాలో 2.2 లక్షల జాబ్ కార్డులుండగా మొత్తం 3.87 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో వ్యవసాయ పనులకు వెళ్లే వారిని మినహాయిస్తే దాదాపు 1.8 లక్షల మంది కూలీలకు ఏటా వంద రోజుల పనులు కల్పించారు. రోజూ రూ.300 చొప్పున కూలి అందుతుండడంతో అప్పట్లో ఉపాధి పనులల్లో కూలీలు సగర్వంగా పాలుపంచుకుంటూ వచ్చారు.

ఏటా రూ.కోట్లలోనే పనులు..

వైఎస్సార్‌సీపీ హయాంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 79.53 లక్షల పని దినాలకు సుమారు రూ.170.8 కోట్లను ఖర్చు చేశారు. 2023–24లో 78.35 లక్షల పని దినాలకు గాను రూ.176.57 కోట్లు ఖర్చు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటి వరకూ 72.68 లక్షల పని దినాలకు రూ.187.32 కోట్లు వెచ్చించారు. గతంలో ఉపాధి పనులకు వెళ్తే రూ.300 వరకూ కూలి గిట్టుబాటయ్యేది. చెరువుల్లో పూడిక తీత పనులు, ఫారం పాండ్ల ఏర్పాటు, మెట్ట భూముల్లో ఉద్యాన మొక్కల నాటేందుకు గుంతలు తవ్వడం, మొక్కల పెంపకం, ఖండిత కందకాలు, కొండ చుట్టూ ట్రెంచ్, చెక్ డ్యాంల్లో పూడిక తీత, భూముల చదును పనులు, రోడ్ల ఏర్పాటు తదితర పనులు చేయించారు.

జిల్లాలో జాబ్ కార్డుల సంఖ్య	2.2 లక్షలు
గత ప్రభుత్వంలో ఏడాదికి చేపట్టిన పనుల విలువ	రూ.170 కోట్లకు పైగా

భూగర్భ జలాల పెంపు..

గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు తోడు విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెంపొందాయి. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనుల్లో వర్షపు నీళ్లు నిలబడి పచ్చదనం సంతరించుకుంది. చెరువుల్లో తీసిన పూడిక తీత పనుల ద్వారా ఏర్పడిన గుంతల్లో భారీగా వర్షం నీళ్లు నిలుస్తున్నాయి. కొండల చుట్టూ కొట్టిన ట్రెంచ్‌లలో వర్షం నీరు ఎక్కడికక్కడే ఇంకి పోయి జిల్లాలో సగటున 9.46 మీటర్లకు భూగర్భజలాలు ఎగబాకాయి. ఎండలు తీవ్ర స్థాయికి చేరుకున్న గత మే నెలలో 17.67 మీటర్లుగా భూగర్భ జలాలు నమోదు కావడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ఎటు చూసిన బోరు బావుల్లో సమృద్ధిగా నీళ్లు లభ్యమవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు అక్టోబర్ 24 నాటికి 5.23 మీటర్లకు భూగర్భ జలాలు ఎగబాకినట్లు ఆ శాఖ అధికారి మల్లికార్జున రావు తెలిపారు.

విస్తారంగా పండ్ల తోటలు..

ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో మెట్ట భూముల్లో పండ్ల తోటల సాగును అధికారులు ప్రోత్సహిస్తూ వచ్చారు. గత ప్రభుత్వంలో ట్రాక్టర్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించడంతో రైతులు ముందుకు వచ్చి పండ్ల తోటల సాగు చేపట్టారు. ఏటా 10 వేల హెక్టార్లకు డ్రిప్పు పరికరాలను అప్పట్లో రైతులకు అందించారు. గత మూడేళ్లలో 13,921 హెక్టార్లలో పండ్ల తోటలు సాగులోకి వచ్చాయి. పండ్ల తోటల్లో సైతం ట్రెంచ్ ఏర్పాటు, మొక్కల చుట్టూ పాదుల పనులను ఉపాధి హామీ పథకం కింద పూర్తి చేయడంతో వర్షం నీరు సమృద్ధిగా నిలిచి తోటలు జీవం పోసుకున్నాయి.

ఉపాధి పనుల ఫలితాలు దక్కాయి



జిల్లాలో గతంలో చేసిన ఉపాధి పనుల ఫలితాలు ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. కూలీలకు చేతినిండా పని దొరకడంతో పాటు పండ్ల తోటల పెంపకం, భూగర్భ జలాల పెంపు ఇలా ఎన్నో విధాలుగా ఫలితాలు దక్కాయి. రైతులు పండ్ల మొక్కల పెంపకానికి ముందుకొస్తున్నారు. పనులకు వస్తే నిరంతరం ఉపాధి కల్పిస్తాం. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు చూపుతున్నాం. బిల్లులు సైతం సకాలంలో చెల్లిస్తున్నాం.

– విజయ్‌ప్రసాద్, డ్వామా పీడీ

వడ్డీ వ్యాపారుల వేధింపులు... అజ్ఞాతంలోకి అధ్యాపకుడు

కదిరి టౌన్: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ అధ్యాపకుడు అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు... కదిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఖాజీ మహమ్మద్ ఇకిల్ తన కుటుంబ అవసరాలు, ఇతరత్రా వాటికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. వడ్డీల భారంతో అప్పులు తీర్చలేని స్థాయికి చేరుకున్నాడు. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారులు తరచూ వేధింపులకు గురి చేస్తుండడంతో మనస్తాపం చెంది సోమవారం ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఘటనపై బాధితుడి భార్య షబానా ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

కదిరి టౌన్: స్థానిక ఎన్జీఓ కాలనీలో నివాసముంటున్న కుమార్ భార్య నందిని కనిపించడం లేదు. సోమవారం మధ్యాహ్నం భర్తతో గొడవ పడి ఇల్లు విడిచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కాగా, కుటాగుళ్లకు చెందిన గంగాద్రితో ఆమె చనువుగా ఉండేదని, ఆమెను గంగాద్రినే పిలుచుకుని వెళ్లి ఉంటాడనే అనుమానాలు వ్యక్తం చేస్తూ నందిని తల్లి జంగాల రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ధర్మవరం కుడి కాలువకు నీరు విడుదల చేయండి

కూడేరు: పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడికాలువకు నీరు విడుదల చేయాలని మరుట్ల, జల్లిపల్లి, కూడేరు, కలగళ్ల, ఉదిరిపికొండకు చెందిన రైతులు అధికారులను కోరారు. కుడి కాలువ గుండా నీరు ప్రవహిస్తే వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. నీటి కొరతతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోలేక పోతున్నామని వాపోయారు.

రైల్వేలో ఎన్నికల వేడి



మజ్దూర్ యూనియన్ నాయకుల ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

- డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు
- డివిజన్ వ్యాప్తంగా 14,453 మంది ఓటర్లు
- ప్రచారంలో నిమగ్నమైన సంఘ్, యూనియన్ నాయకులు

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల వేడి రాజుకుంది. ఇంకా పోలింగ్ ప్రక్రియకు నెల రోజుల గడువు ఉండడంతో రైల్వేలో ప్రధానమైన మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో రైల్వే అధికారులు తలమునకలయ్యారు.

34 చోట్ల పోలింగ్ కేంద్రాలు..

గుంతకల్లు డివిజన్‌లో మొత్తం 14,453 మంది ఓటర్లు (నాన్ గెజిటెడ్) ఉండగా, దాదాపు 34 చోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో గుంతకల్లు, గుత్తి, అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, కదిరి, తిరుపతి, రేణిగుంట, డోన్, రాయచూర్, యర్రగుంట్ల, బనగానపల్లి, నంద్యాల, నందలూరు, కడప, కొండాపురం, ప్రొద్దుటూరు, బిత్తూరు, పాకాల, యాదగిరి, ఆదోని, రైల్వే కోడూరు, వెంకటగిరి, మంత్రాలయం, కృష్ణా, శ్రీకాళహస్తి, మదనపల్లి తదితర కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మూడు రోజుల పాటు పోలింగ్ ..

డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో మూడు రోజుల పాటు పోలింగ్ నిర్వహించనున్నారు. 4, 5వ తేదీల్లో సాధారణ రైల్వే కార్మికులు, 6వ తేదీ కేవలం రన్నింగ్ స్టాఫ్ మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేలా కార్యాచరణను రూపొందించారు. అంతేకాక సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలూ ఏర్పాటు చేయనున్నారు. ఓటు హక్కు వినియోగించే వారు రైల్వే యాజమాన్యం జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఊపందుకున్న ప్రచారం..

రైల్వే సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సంఘ్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ నేతృత్వంలో డివిజన్ వ్యాప్తంగా ప్రచారం ఊపందుకుంది. డివిజన్‌లోని అన్ని ప్రధాన కేంద్రాల్లో ప్రచార పోస్టర్లు వెలిసాయి. డివిజన్ కేంద్రం గుంతకల్లులోని రైల్వే పరిసరాలు, ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కార్మికులను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీల తరహాలో కార్యాలయాలతో పాటు వారి ఇళ్లనూ అభ్యర్థులు చుట్టేస్తున్నారు. యూనియన్ నేతలు ఓట్ ఫార్ ఫ్లాగ్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేయగా, సంఘ్ నాయకులు ఓట్ పర్ రైలింజన్ అంటూ పెద్ద ఎత్తున ప్రచారానికి తెర లేపారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన మజ్దూర్ యూనియన్‌పై ఎలాగైన ఈ సారి గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలని సంఘ్ నేతలు ప్రయత్నిస్తుండగా, మరోసారి గెలుపు బావుటా ఎగరవేయాలనే కుతూహలం యూనియన్ నేతల్లో వ్యక్తమవుతోంది.

ఎలక్ట్రానిక్స్‌తో అన్ని విభాగాలు మమేకం



ఈ-మెర్జ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: ఎలక్ట్రానిక్స్ విభాగంతో అన్ని విభాగాలు మమేకం అయ్యాయని జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య హెచ్.సుదర్శనరావు తెలిపారు. జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని ఈసీఈ విభాగంలో ఈ-మెర్జ్ 2కే24 పేరుతో మంగళవారం జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్ వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సుకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి అధ్యక్షత వహించగా, పి.జయప్రకాష్ (ఆలోనెల్ టెక్నాలజీ, బెంగళూరు) గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి. మమత, డాక్టర్ లలితకుమారి కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. హెచ్.సుదర్శనరావు మాట్లాడుతూ... సాంకేతిక రంగం అభివృద్ధిలో వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు.

రూ.8 కోట్ల విలువైన ఆవిష్కరణ..

ప్రాజెక్ట్ అనంత పేరుతో ఐఓటీ ప్రాసెసర్‌ను ఈసీఈ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు ఆవిష్కరించారు. రూ.8 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌ను నయాపైసా ఖర్చు లేకుండా రూపకల్పన చేశారు. పరిశోధనా రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఈ ఆవిష్కరణను సమాజానికి చేరువ చేసేందుకు వీలుగా పరిశ్రమకు అప్పగించారు. మంగళవారం ఈ-మెర్జ్ పేరుతో నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ ఆవిష్కరణ పారిశ్రామికవేత్తలను, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను విశేషంగా ఆకర్షించింది. ఎస్ఓసీ (సిస్టమ్ ఇన్ చిప్)ను డిజైన్ చేసి ఐఓటీ ప్రాసెస్ ద్వారా పని చేసేలా కృషి చేశారు. చిప్ లేకుండానే డివైజ్ పనిచేయడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం థియరీ టెస్టింగ్ పూర్తయింది. అనంతరం ప్రోటో టైప్ పూర్తిచేసిన తరువాత ఫ్యాబ్రికేషన్ అసెంబుల్ చేయనున్నారు. అనంతరం పరిశ్రమలో వస్తువు ఉత్పత్తిని చేపడతారు. ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా చిప్‌లెస్ డిజైన్ పూర్తి చేయడం ప్రశంసనీయం అని వర్సిటీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పరిశోధనలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి. మమత పర్యవేక్షణలో విద్యార్థులు చరణ్, అర్జున్, హేమంత్, మధు, పెంచల్, సుధ, షణ్ముఖ్, హరిణి, చరిత, అక్షయ, హిమశ్రీ, ఉజ్వల, గీతాభవాని భాగస్వామ్యం అయ్యారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజారోగ్యానికి పాటుపడే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అధికారులంతా కృషి చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్కావెంజర్ల సంక్షేమం కోసం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు అవసరమైన మేరకు గ్లౌజులు, మాస్కులు తదితర వాటిని అందించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలోని పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. పారిశుధ్య కార్మికుల జాబితాను ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి తెప్పించుకుని రీ-సర్వే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, స్కావెంజర్ కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, గంగులప్ప, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, ఎల్‌డీఎం రమణకుమార్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సారయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రామ్, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర, కదిరి, ధర్మవరం, హిందూపురం మున్సిపల్ కమిషనర్లు ప్రహ్లాద్, శ్రీనివాసులు, రంగస్వామి, కిరణ్‌కుమార్, ప్రమోద్ కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్‌లో రాజ్య పురస్కార్‌కు రామసాగరం విద్యార్థి



విద్యార్థి జీ ధనుష్

బొమ్మనహళ్/బెళుగుప్ప: రామసాగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి జీ. ధనుష్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ సాధించి రాజ్యపురస్కార్ ప్రమాణ పత్ర ప్రదానోత్సవానికి ఎంపికయినట్లు హెచ్ఎం మురళీధర్‌మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల పూలకుంటలో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చాటి, ఉమ్మడి అనంత జిల్లా తరఫున ఎంపికయినట్లు హెచ్ఎం తెలిపారు. ఈనెల 7న విజయవాడలో గవర్నర్ చేతుల మీదుగా ధనుష్ రాజ్యపురస్కార్ పత్రాన్ని అందుకుంటాడన్నారు.

పక్కా ప్రణాళికతోనే అభివృద్ధి



శిక్షణ తరగతులకు హాజరైన ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: పక్కా ప్రణాళికలతోనే సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. 'గ్రామ పంచాయతీ అభివృద్ధి–ప్రణాళిక' అంశంపై అనంతపురంలోని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతులు మంగళవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ సమగ్రాభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్ర ప్రగతికి దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన పనులు గుర్తించడం, నిధులు సమీకరించడం, ప్రాధాన్యతాక్రమంలో వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభలు నిర్వహించి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని పనులు గుర్తించాలన్నారు. 29 అంశాలు ప్రామాణికంగా తీసుకొని శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, గృహ నిర్మాణ శాఖ పీడీ శైలజ, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్ధాకలితో అలమటించిన ఉద్యోగులు..

రెండ్రోజుల శిక్షణ కోసం ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల నుంచి వచ్చిన వివిధ శాఖల అధికారులు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం సరిగా లేక ఆకలితో అలమటించారు. ఏమాత్రం రుచి, శుచి లేని ఆహార పదార్థాలు వడ్డించడంతో తాము తినలేకపోయామని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. డీపీఆర్‌సీ ఉద్యోగులు కొందరు చేతివాటం ప్రదర్శించడమే ఇందుకు కారణమంటూ ఆరోపించారు.

రోషన్ సెంచరీ







దేవ్ ప్రమోద్(డబుల్ సెంచరీ), రోషన్ (117 పరుగులు), తోషిత్ యాదవ్ (5 వికెట్లు)

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్–16 క్రికెట్ టోర్నీలో భాగంగా మంగళవారం జరిగిన పోటీల్లో పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. టీం–ఏ, టీం–బీ మధ్య జరిగిన తొలి ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీం–ఏ జట్టు పది వికెట్లు కోల్పోయి 266 పరుగులు సాధించింది. టీం –బీ 215 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో టీం–ఏ జట్టు 7 వికెట్ల నష్టానికి గాను 217 పరుగులు చేసింది. జట్టులో బ్యాటర్ ఆర్.రోహన్ గణపతి సెంచరీ (117 పరుగులు)తో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీం–బీ జట్టు 60 పరుగుల వద్ద చతికిలబడింది. టీం–ఏ బౌలర్ ఎం.తోషిత్ యాదవ్ 5 వికెట్లు సాధించాడు. 208 పరుగులతో టీం–ఏ జట్టు ఘన విజయం సాధించింది.

- టీం–సీ, టీం–డీ మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో టీం–డీ జట్టు పది వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. టీం–సీ జట్టు కేవలం 139 పరుగులు చేసి ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో టీం–డీ జట్టు 360 పరుగులు చేయగా, టీం–సీ జట్టు 121 పరుగులు మాత్రమే చేసింది. ఫలితంగా టీం–డీ 446 పరుగులతో ఘన విజయం సాధించింది. టీం–డీ జట్టు బ్యాటర్‌జి. దేవ్‌ప్రమోద్ డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

సైన్స్‌ఫేర్‌లో రాష్ట్రస్థాయికి ఏడు ప్రాజెక్టులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల జోనల్‌స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉమ్మడి జిల్లాలోని ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి గతనెల 24న బుక్కరాయసముద్రం కొర్రపాడు గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 16 గురుకులాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ చాటిన ప్రాజెక్టులను జోనల్‌స్థాయికి ఎంపిక చేశారు. అదేనెల 28,29 తేదీల్లో కర్నూలు జిల్లా డోన్ గురుకులంలో జోనల్‌స్థాయి పోటీలు నిర్వహించారు. అక్కడ సత్తాచాటిన ఉమ్మడి జిల్లాలోని గురుకులాల విద్యార్థులు ఈనెల 18, 19 తేదీల్లో పల్నాడు జిల్లా ఆర్కే పురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఉదయశ్రీ తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల వివరాలు

పాఠశాల	థీమ్	విద్యార్థుల పేర్లు	గైడ్‌టీచరు
గుత్తి	సైన్స్	ఎం.భవ్యదీపిక	రామాంజనమ్మ
గుత్తి	ఐసీటీ	ఎం.తొలశ్రీ	పంకజాక్షి
ఉరవకొండ	హ్యుమనిటీస్	మాన్యశ్రీ,అమృతలక్ష్మీ	సునీత
ఉరవకొండ	సోషల్‌స్టడీస్	మైథిలి,శరణ్య,రాగశ్రీ	సుధారాణి
కణేకల్లు	మాథమాటిక్స్	హర్షవర్ధన్,కుమార్‌నాయక్	ఎన్.స్వామి,బాషా
కణేకల్లు	హ్యుమనిటీస్	మొజెష్‌-ధనుష్	షెక్షావలి
కాళసముద్రం	మేథ్స్	ఆంజనేయులునాయక్	రాజశేఖర్‌రెడ్డి